# మలుపు తిరిగిన మమత

'పోస్టుమేన్' తెరచిన తలుపుముందు నిల్చుని కేకపెట్టాడు రాముడు.
ఆ కేక వినగానే లోపలనుంచి శ్యామల పరుగున వచ్చింది. ఉత్తరం అందుకుంది. ఒక చిన్న మందస్మితం— పోస్టుమేన్ రాముడుకూడానవ్వాడు ఒకక్షణం. 'వస్తా' నన్నట్లు చేయిఊపి, సైకిలుఎక్కాడు. సైకిలు గంట గణగణమ్రోగింది. రాముడు వీధిమలుపులో మాయమయ్యాడు.

'రాముడు ఎంత మంచివాడు?' శ్యామల లోలోపల అనుకుంటూ వెళ్ళిపోయే అతడివైపు చూసింది.

ఉత్తరం విప్పింది. మోహనరావు అమెరికానుంచి వ్రాశాడు. ఎన్నో సంగతులు... ఆరోజు బీచికివెళ్ళాడట స్నేహితులతో. ఆడవాళ్ళు— మగ వాళ్ళు... ఎంతోమందితో సముద్రస్నానాలు చేశాడట .. ఇంటికి వచ్చే టప్పుడు మంచి గవ్వలు, శంఖాలు తెస్తానని వ్రాశాడు. ఇంకా యేదో తియ్యగా... మధురంగా .. శ్యామల ఒళ్ళు పులకరించిపోయింది.

మోహనరావు, తనూ, రాముడూ చిన్నప్పుడు ఒకే ప్రాధమిక పాఠశాలలో చదివారు. తాను ఒకటో క్లాసులో ఉండగా, వాళ్ళిద్దరూ మూడవక్లాసు చదివేవారు. రాముడు స్వయాన ఏనకు అత్తకొడుకు. మోహనరావు ఆపూరి మునసబుకొడుకు. వయస్సు పెరుగుతూంటే, చదు

వులు హెచ్చుతూంటే ముగ్గురూకలిసి ఆడుకునేవారు. రాముడు స్కూలు ఫైనలుతో ఆగిపోయాడు డబ్బులేక. తనకు అంతకంటె చదువెందుకని చదువు చెప్పించలేదు యింట్లోవాళ్లు. మోహనరావు కాలేజీలో చేరాడు. తర్వాత ఇంజనీరింగులో పెద్ద చదువులకోసం అమెరికా వెళ్ళాడు.

స్కూలుఫైనలుకాగానే రాముడు తల్లి తన్ను రాముడి కిచ్చి వివాహంచేయమని శ్యామలతల్లి నడిగింది. రాముడు తన్ను గురించి యెంతో అభిమానంగా, ప్రేమగా సంచరించేవాడు. శ్యామల తన భార్య అవుతుందేమో అని యెంతో ఆశించాడు. కాని శ్యామల తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. రాముడికి డబ్బులేదని చదువు యెక్కువ లేదని...

అయితే రాముడికంటె శ్యామలకుకూడా మోహనరావుమీదే మోజు పెరిగింది. తల్లిదండ్రులు ఇష్టపడ్డారు. మోహనరావు కూడా సూచనగా చెప్పాడు శ్యామలను పెండ్లిచేసుకుంటానని... మనసబుకూడా కాదనడని ధైర్యంచెప్పాడు మోహనరావు. అమెరికాలో చదువులు పూర్తిచేసుకు రాగానే మనపెండ్లి.. అన్న మోహనరావు మాటలు శ్యామల చెవుల్లో గింగురుమంటున్నాయి. ఉత్తరం వచ్చినరోజున_నిజంగా మోహనరావును చూసినంత తన్మయమవుతుంది ఆమె.

శ్యామల తన్ను పెండ్లి చేసుకోదన్న సంగతి నిర్ధారణ అయ్యాక ఒకరోజు రాముడు శ్యామలను ఊరిచివర గుడి తీర్థంనాడు కలుసుకున్నాడు పీచుమిఠాయి తింటూంటే శ్యామల కన్పించింది తల్లితో... తల్లి లక్క పిడతలు బేరంచేస్తూంటే , రాముడు శ్యామలను ప్రక్కకు పిలిచి పీచు మిఠాయిపెట్టాడు. ఎదురుగా ఎవరో దంపతులు నడిచిపోయారు.

"ఎప్పుడు నీపెళ్లి?" రాముడు నవ్వాడు మెల్లిగా. శ్యామల సిగ్గు పడింది.

"నువ్వు సుఖంగా వుంటేచాలు శ్యామలా! నాకు అదే-చాలాఇష్టం నన్ను చేసుకోనందుకు నాకు చింతలేదు... మరో మిఠాయికొననా?"

"వద్దు. అమ్మతోపోవాలి!" ముందడుగు వేసింది శ్యామల.

రాముడి స్నేహితులుకలిశారు. వాళ్ళతో వెళ్ళిపోయాడు రాముడు.

రాముడు తండ్రికూడా పోస్టుమేన్ పనిచేసేవాడు. తండ్రిపోయాక ఆ ఉద్యోగం కొడుక్కే ఇచ్చారు.

శ్యామల ఉత్తరంమడిచి జాగ్రత్తగా పెట్టిలోదాచింది. ఆ పెట్టెలో బట్టలుక్రింద ఇంకా ఎన్నో ఉత్తరాలు.— 'శ్యామలా! నీ అధరాలు కెంపుల్లా మెరుస్తూంటే .. నీ సింధూరతిలకం ముఖంలో వెలుగుతూంటే నాకు యేమిటో... శ్యామలా! నీకోల ముఖంలోని కోమలత్వం ..... అవును... మనం పెళ్ళిచేసుకున్నాక, ఎక్కడికో కొండలపైకి పోయి కొన్నాళ్ళు హాయిగా...పిట్టల్లా విహరించాలి...' శ్యామలకు చెప్పలేనంత సిగ్గు. ఆనందం కలిగాయి. అమెరికాలో మోహనరావు తనగదిలో టేబిలు దగ్గరకూర్చుని చదువుకునే టైము...నవ్వుకుంది శ్యామల.

* * *

రోజులు గడుస్తున్నాయి. అప్పుడప్పుడు రాముడు శ్యామలకు మోహనరావు వ్రాసిన ఉత్తరాలు బట్వాడా చేస్తూనే ఉన్నాడు. అదే కాకుండా పండుగకూ. పబ్బానికీ కలిసిమెలిసి భోజనాలు ఆ రెండు కుటుంబాలూ చేస్తూనేఉన్నాయి. రాముడు కాని, అతని తల్లి కాని శ్యామలతో వివాహం కుదరలేదనే విషయం మళ్ళీ ప్రస్తావించలేదు. ఉన్నబంధుత్వం మర్యాదగానే కాపాడుకున్నారు. రాముడు తల్లికూడా కాబోయే భర్త మోహనరావు మాట కదిలించి శ్యామలను వేళాకోళం చేస్తూనే ఉండేది.

ఇలా ఉత్తరాలు వస్తూపోతున్న సంగతి మునసబుకు తెలిసింది. శ్యామల తండ్రిని మునసబు పిలిచి అడిగాడు నిజమేనా అని. శ్యామల తండ్రి నిజం చెప్పేశాడు. మునసబు ఒక క్షణం ఆలోచించి 'సరే- వాడి యిష్టమే నాయిష్టం. త్వరలో చదువు పూర్తిచేసుకు రానీండి!' అన్నాడు ఆనందబాష్పాలు రాలుస్తూ. ఆ సాయంత్రమే శ్యామల దగ్గరికి వచ్చాడు. శ్యామలను చిన్నపిల్లగా వీధిలో చూడడమేకాని మునసబు ఆమె ఎదిగి యౌవనం పుంజుకున్నాక ప్రథమంగాచూసి, ఆమెలోని కళకు అచ్చెరువొందాడు. నాకు లక్ష్మిలాంటి కోడలు లభిస్తుంది అని సంబరపడ్డాడు మునసబు. మర్నాడు తన అంగీకారం తెలుపుతూ ఉత్తరం రాశాడు కొడుక్కు.

సంవత్సరం గడిచింది. సెలవలకు యింటికి రమ్మని మునసబు రాశాడు మోహనరావుకు. బహుశా ఆఏటితో చదువు పూర్తవుతే యింటికి వచ్చేసి ఉద్యోగమే చూసుకోమన్నాడు... డబ్బు పంపడం తప్ప మునసబుకు ఇంజనీరింగు చదువు వివరాలు తెలియవు. మోహనరావు జవాబిచ్చాడు యీయేడు పూర్తిచేసుకుని ముందు యింకా పెద్దచదువుల ప్రయత్నం అక్కడే చేయాలనుకుంటున్నాను. అక్కడి కొందరు ప్రొఫెసర్లు తనకు స్కాలర్‌షిప్పు యిప్పిస్తామని వాగ్దానంచేశారని వ్రాశాడు. మునసబుకు ఏమనాలో తోచలేదు. కొడుకును చూడాలనే ఆత్రుత పెరిగింది. ఎలాగైనా వీలుచేసుకుని రమ్మని వ్రాశాడు... కాని మోహనరావు దగ్గర నుంచి ఉత్తరంలేదు... మునసబు పరిపరివిధాల సతమతమయ్యాడు. శ్యామల దగ్గరకువచ్చి అడిగాడు. ఉత్తరాలు ఏమైనా వచ్చాయాఅని. ఆమె గూడా రాలేదంది. మునసబు నిర్విణ్ణుడయ్యాడు.

* * *

నాల్గునెలలు గడిచాక, మునసబుకు, శ్యామలకు, మోహనరావు దగ్గరినుంచి ఉత్తరంవచ్చింది. తాను హఠాత్తుగా జబ్బుపడ్డానని, అందుకే యింటికి రాలేకపోయానని రాశాడు. కొడుకు కులాసాగా ఉన్నందుకు మునసబు సంతోషించాడు. శ్యామల వేయిదేవుళ్ళకు మొక్కుకుంది. అతను క్షేమంగా ఇంటికివచ్చేలా చేయమని యింకా ఎన్నోఉత్తరాలు వస్తాయని ఆశించింది శ్యామల.

రాముడు తనసైకిలుమీద గంట వాయించుకుంటూ అప్పుడప్పుడు డ్యూటీమీద శ్యామలఇంట్లో ఉత్తరాలు వేస్తూనేఉన్నాడు. అక్క దగ్గర నుంచి, బాబయ్య... మామయ్య...పిన్ని ... కాని ... మోహనరావు ఉత్తరంలేదు— శ్యామలకు దిగులు పెరిగింది.... ఉత్తరం లేనప్పుడు వాకిట్లో నిలుచున్న శ్యామలను చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయేవాడు రాముడు.

మరో ఆరునెలలు గడిచాయి. శ్యామల ఆశలన్నీ నిరాశలుగామారి బాధపడింది. ప్రతిరోజూ ఉత్తరంకోసం గుమ్మందగ్గర కాచుక్కూర్చోడం, చివరకు రాముడు సైకిలుమీద నవ్వుతూ చెయ్యి ఆడిస్తూ వెళ్ళిపోవడం జరుగుతోంది. శ్యామల హృదయాంతరంలో గబుక్కున ఒక ఆలోచన కలిగింది. ఆమె ముఖం కోపంతో జేగురురంగు దాల్చింది.

మర్నాడు రాముడు టపాతెచ్చే టైంకోసం వేచికూర్చుంది. రాముడు సైకిలుమీద వెళ్ళిపోతుంటే పిలిచింది. రాముడు నవ్వుతూ దగ్గరకువచ్చాడు

"బావా! నిన్నోసంగతి అడగనా?"

"అడుగు"

"నిజంగా మోహనరావు ఉత్తరాలు రాయటంలేదూ?"

"ఉంటే నేనివ్వనా– ఇవ్వడం నాడ్యూటి!" మృదువుగా నవ్వాడు రాముడు.

అది విషపునవ్వుగా భావించింది శ్యామల.

"లేదు రాముడూ! నువ్వు ఆ ఉత్తరాలు దాచేస్తున్నావు. నేనంటే నీకు అసూయ, కోపం... నువ్వు దుర్మార్గుడివి!" గట్టిగా కోపంతో అరిచేసింది శ్యామల. కోపం తట్టుకోలేక, బాధ దిగమ్రింగలేక ఏడ్చేసింది.

రాముడు దిగ్భ్రమ చెందాడు.

"శ్యామలా! నాకు నీమీద యేమీకోపం, అసూయలేవు. నీసుఖమే నేను వాంఛించేది. ఉత్తరాలుదాచి నేను నీకు అన్యాయం చెయ్యలేను శ్యామలా! అది నా నైజానికే ఎదురు... నిజంగా ఉత్తరాలు రావటం లేదు. నన్ను క్షమించు శ్యామలా!" రాముడి కంటినుండి వేడి భాష్పాలు రాలాయి.

గట్టిగా అరిచినందుకు శ్యామల గబుక్కున కళ్ళు తుడుచుకుని, ముఖ కవళికలు మార్చుకుని, పశ్చాత్తాపంతో రాముడివైపు నిదానంగా చూచింది.

దీనంగా, బాధగా రాముడు కొంతదూరం తలవంచుకుని, సైకిలు నడిపించుకుంటో నడిచాడు.

శ్యామల కేకవిన్న తల్లి "ఏమిటే– ఎవరిమీదో అరుస్తున్నావు!" అంటూ వచ్చి వీధిగుమ్మంలోకిచూసింది. ఈలోగానే రాముడు కనుచూపు దూరంనుంచి మాయమయ్యాడు.

ఈ సంఘటనజరిగిన నాల్గునెలలదాకా రాముడు ఉత్తరాలు తెచ్చి 'పోస్టుమేన్' అని కేకపెట్టకుండా కిటికీలోంచి శ్యామల ఇంటిలోకి ఉత్త

రాలు వేసేవాడు. ఒకవేళ శ్యామల కనిపించినా తలవంచుకుని నమ్రతగా వెళ్ళిపోయేవాడు. ఈ దృశ్యం శ్యామలను యెంతో బాధించింది...

శ్యామలకు మోహనరావు మళ్లీ ఒక ఉత్తరంరాశాడు. క్లుప్తంగా మూడేముక్కలు. 'శ్యామలా! నేను అమెరికాలో ఉండిపోవటానికి నిశ్చయించుకున్నా. ఇక్కడే వివాహంచేసుకుని... ఇంక నన్నుమర్చిపో!...., పిడుగులాంటి ఆ ఉత్తరం శ్యామలహృదయం బ్రద్దలుచేసింది. ఆవేదన భరింపలేక శ్యామల వెక్కి వెక్కి యేడ్చింది. ఇదేధోరణిలో మునసబుకు కూడా కొడుకువద్దనుంచి ఉత్తరంవచ్చింది. అగ్గిమీద గుగ్గిలం వేసినంత భగ్గుమన్నాడు మునసబు. కొడుకును నానా శాపనార్థాలు పెట్టాడు.... ఓ సాయంత్రం శ్యామలయింటికివచ్చి ఆమెను ఓదార్చి వెళ్ళిపోయాడు.

మోహనరావు క్రొత్తపరిస్థితి రాముడికి చూచాయగా తెలిసింది. అయినా శ్యామల తన్ను అన్నమాటలు ఇంకా అతన్ని బాధిస్తూనేఉన్నాయి. ఆవిధంగా ఆమె తన్ను విశ్వసించనందుకు రాముడు బాధపడ సాగాడు.

రాముడి తల్లికి జ్వరంవచ్చి, ఒక వారంరోజులు మంచంమీద తీసుకుని, అనుకోకుండానే యీ లోకంవిడిచి వెళ్ళిపోయింది. ఆ తల్లికి రాముడు ఒక్కడేకొడుకు అవటంచే తనచుట్టూ అంతా ఏకాంతం, శూన్యం గోచరించాయి రాముడికి.

శ్యామల, ఆమె తల్లిదండ్రులు రాముడిని ఓదార్చారు. వారి సమక్షంలోనే తల్లి దహనక్రియ జరిపాడు రాముడు. మరో నెల ఉద్యోగానికి సెలవుపెట్టాడు. శ్యామల రాముడినిచూచినా, ఎక్కువ చనువుగా అతనితో మాట్లాడలేకపోయింది. ఆనాడు మోహనరావు ఉత్తరంకోసం అతన్ని అవమానించినదృశ్యం ఆమెను యెంతో కలచివేసింది...

రాముడు నెలరోజులు సెలవు పెట్టినట్లు శ్యామలకు తెలియక అతను వచ్చే టైమ్‌లో గుమ్మంలో నిలుచునేది. కాని నిరాశగా తిరిగి ఇంట్లోకి పోయేది.

తర్వాత రాముడికే జ్వరంవచ్చిందని తండ్రి, శ్యామల సమక్షంలో ఆమెతల్లితో ఓరోజు చెప్పాడు. 'పోనీ! మనింట్లో కొన్నాళ్ళు ఉండమన లేకపోయారా?' అందా తల్లి. కాని రాముడు ఒప్పుకోలేదని శ్యామల తండ్రి చెప్పాడు.

శ్యామల మనస్సులో ఏవో అగ్నిగుండాలుదొర్లాయి. ఏదో ఆత్మీయత ఇంక తనకు దక్కదేమో అని భయపడింది. మర్నాడు మధ్యాహ్నము ప్రక్కవీధి స్నేహితురాలింటికి వెడుతున్నానని తల్లితో చెప్పి, తిన్నగా రాముడింటికి వచ్చేసింది శ్యామల. తలుపు జార్లావేసిఉంది. గెంటి లోపలికినడిచింది శ్యామల. ఆ పెంకుటిల్లు వసారాలో రాముడు మంచం మీద పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ప్రక్కనే చిన్న ముక్కాలిపీటమీద మందులసీసా, బత్తాయిపండ్లు కనిపించాయి. తలుపు వైపు తలపెట్టుకుని మంచంమీద పరున్న రాముడు, శ్యామల రాక గమనించలేదు.

మెల్లిగా దగ్గరకువెళ్ళి నిలుచుంది శ్యామల "బావా" అంటూ.

వెనక్కి తిరిగిచూశాడు రాముడు, ఉలిక్కిపడి.

శ్యామల దీనంగా నిలుచుంది ..

"వచ్చావా శ్యామలా! కూర్చో!" ఎదురుగా చాప చూపించాడు రాముడు నవ్వుతూ.

"ఎల్లావుంది జ్వరం?" శ్యామల దగ్గరకువచ్చి ఒళ్ళు ముట్టుకుంది. జ్వరం కాగిపోతోంది. అయినా నవ్వుతూ రాముడు కనిపించాడు. ఎంత

కష్టంవచ్చినా సుఖంగా బ్రతికే యత్నంచేసే రాముడిలోని మనస్తత్వం శ్యామలకు అర్థమయింది...

"మందు తీసుకున్నావా?"

"తీసుకోవాలి. టైమ్ అయింది!"

"నేను ఇవ్వనా?"

"నీకెందుకు శ్రమ? నేనే తీసుకుంటా!"

"వద్దు బావా! నేనిస్తా..." శ్యామల గ్లాసులో మందుపోసిఇచ్చింది రాముడు ఆనందంగా త్రాగాడు.

"మీఅమ్మ చనిపోయాక చాలా చిక్కిపోయావు బావా!"

చిరునవ్వు నవ్వాడు రాముడు.

"నేనొకటి అడగనా బావా?"

"ఊఁ"

"నన్ను క్షమిస్తావా బావా?" కన్నీరు పెట్టుకుంది శ్యామల.

"నిన్ను అనవసరంగా ఎన్నో మాటలన్నాను. నాపాపానికి ప్రాయశ్చిత్తం జరిగింది. నీ పాదాలదగ్గర సేవచేసే హక్కుకూడా నాకు లేదు. దురదృష్టవంతురాల్ని!" శ్యామల కంఠం గద్గదమయింది. ఆమె ముఖం విచారంతో కుమిలిపోయింది.

"ఎందుకు శ్యామలా, ఆవిచారం! మోహనరావు కాకపోతే మరో మంచిసంబంధం మీనాన్న తెస్తారు. నువ్వు సుఖంగా వుండటమే నాకు కావాలి. నన్ను అపార్థం చేసుకున్నావనే నాబాధ. అంతకంటె యెక్కువ బాధపడేహక్కు నాకులేదుగా!" నవ్వాడు రాముడు.

శ్యామల రాముడి కళ్ళల్లోకి సూటిగా చూసింది. "నన్ను క్షమించావా బావా!" ఇంతకంటె యెక్కువ నేను అడిగే అధికారం నాకూలేదు."

శ్యామల గంభీరంగా లేచి నిలుచుంది.

"వస్తా బావా!"

శ్యామల వెళ్ళిపోయింది.

రాముడికి జ్వరం తగ్గింది. మళ్లీ డ్యూటీలో చేరాడు.

ఉత్తరాలు ఆశించకపోయినా శ్యామల రాముడిని చూడాలని గుమ్మంలో నిల్చునేది.

రాముడు సైకిలుమీదపోతూ అమెకేసిచూసి మృదువుగా నవ్వుతూ వెళ్లిపోయేవాడు.

ఒకరోజు మధ్యాహ్నం...

శ్యామల మల్లెపూల అమ్మిని పిలుస్తూంటే...

రాముడు సైకిలుమీద ఎదురుగావస్తూ, శ్యామలనుచూస్తూ పూల అమ్మిమీద సైకిలు ఢీకొట్టాడు.

పూలబుట్ట కిందపడిపోయింది. పూలన్నీ రోడ్డుమీదజారి దుమ్ములో పొర్లాయి.

శ్యామల ఆ దృశ్యంచూసి నవ్వింది.

పూలఅమ్మి రాముడిని నానా కేకలువేసింది.

"పొరపాటయింది అమ్మీ! సరిగా చూసుకోలేదు. ఈ పూల డబ్బంతా ఇచ్చేస్తా-ఎంత?" అన్నాడు రాముడు.

ఆమె సంతోషించి "ఒక రూపాయి!" అంది.

తక్షణం రూపాయి ఇచ్చేశాడు రాముడు. అది తీసుకుని బొడ్డులో పెట్టుకుంటూ, ఒంటి దుమ్ము దులుపుకుంటూ, విసవిసలాడుతూ వెళ్ళిపోయింది అమ్మి.

సైకిలు ఒకవార నిలబెట్టి రాముడు క్రిందపడిన పూలన్నీ ఏరి బుట్టలోవేశాడు.

"శ్యామలా! ఒక చెంబుడునీళ్ళు తెచ్చిపెట్టవూ?"

శ్యామల నవ్వుతూ నీళ్ళుతెచ్చింది.

" ఈబుట్టలో పొయ్యి!" అన్నాడు రాముడు.

నీళ్ళు పోసింది శ్యామల.

"అన్ని పూలుకొన్నావు— ఎందుకు బావా? తలకు దండ చుట్టుకుని పెట్టుకుంటావా?" అంది శ్యామల కిలకిల నవ్వుతూ.

"కాదు శ్యామలా! ఈ పూలన్నీ ఒకరికి ఇవ్వాలని కొన్నా! నువ్వు కొనుక్కునే మంచిపూలు పాడుచేశానుగా... అందుకే కడిగి, శుభ్రంచేసి నీకిస్తున్నా!" అన్నాడు రాముడు.

"లేదు, ఆ పొరపాటు నావల్లే... నేనే ఆ అమ్మిని పిలవకపోతే నీకీ కష్టం, నష్టం ఉండేదికాదుగా...!" నవ్వింది శ్యామల.

రాముడు పూలబుట్ట అందించాడు. స్వచ్ఛమయిన మల్లెపూల ఘుమఘుమ పరిమళాలు వారిద్దరిమధ్య వెదజల్లినట్లయింది.

ఆ మత్తులో వారిద్దరూ ఒకరివైపు ఒకరు ఆనందంగా అభిమానంతో చూసుకున్నారు. ఎదురుగావున్న శ్యామల పెళ్ళికూతురులా కనిపించింది రాముడికి...

'నాకు సుఖమే కావాలి!' అన్న రాముడిమాటలు జ్ఞప్తికివచ్చి, శ్యామల ఒళ్లు పులకరింపుల్లో పరవశం చెందింది.

* * *